3

# ఓటు వి(శి)లువ

ఎలక్షను డ్యూటీ చేసి అలసిపోయిన వాడిలాగా—సూర్యుడు పడమట వాలిపోతున్నాడు. పక్షులు వాటి వాటి దిక్కుల్లోకి చేరుకుంటున్నాయ్. దిక్కులేని పక్షుల్లా ఎదురు చూస్తున్నారు ఎలక్షన్ ప్రిసైడింగ్ ఆఫీసరు, పోలింగ్ ఆఫీసర్లు, మిగతా పోలీసు సిబ్బంది.

ప్రసాదరావు, రాజ నర్సింహ, సాయన్న - ముగ్గురూ ఉపాధ్యాయులే. తాలూకా హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్నారు. ఎలక్షన్ డ్యూటీ చేయాల్సి వచ్చినందుకు తమను తాము, ఉద్యోగాన్ని, ప్రభుత్వాన్ని, ప్రజల్ని తిట్టుకుంటూ ఈ కుగ్రామాన్ని వెతుక్కుంటూ వచ్చారు. దానికి తోడు ఊళ్ళో ఎవరూ వీళ్ళను పట్టించుకోలేదు. ఉట్టి కారంతోనూ, నీళ్ళ మజ్జిగతోనూ తినే జనాభాయే ఎక్కువ. అడిగినా ఎవరూ భోజనం పెట్టలేకపోయారు. ఎలక్షన్ ఆఫీసర్లకు స్వయంగా వండుకోవాల్సి వచ్చింది. అందుకే వాళ్ళకు ఆ వూరి మీద కోపం. సమయం అయిపోగానే బ్యాలెట్ పెట్టెలు, మిగతా సామాగ్రి అంతా ప్యాక్ చేసుకున్నారు. తమను తీసుకుపోవడానికి వచ్చే లారీ కోసం ఎదురు చూస్తున్నారు. పోలింగ్ బూత్ ఆ వూళ్ళోని రచ్చబండ దగ్గర గ్రామ పంచాయతి ఆఫీసు అనబడే గుడిసెలో ఏర్పాటయ్యింది.

ఆ వచ్చే లారీ వూళ్ళు తిరుగుతూ రావాలి. ఇంకా రాలేదు. ఆఫీసు ముందు జనం కాబోయే సమితి ప్రెసిడెంటు గురించి గొంతులు పెంచి వాదులాడుకుంటున్నారు. కళ్ళ జోడు గుర్తు యాదగిరిరెడ్డి వస్తాడని కొందరు, చెంబు గుర్తు మీసాల రోశయ్యొస్తాడని కొంద

రంటుంటే "ఇద్దరు కాకుండ గ్లాసు గుర్తాయన తేల్తడో యేమో" అని మరి కొందరంటున్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ ప్రసాదరావుకు చిరాకు వేసింది. విసురుగా ఆఫీసు బయటకు వచ్చాడు. మెట్ల మీద ముసలి వాడు పడుకుని వున్నాడు. పైగా మూలుగుతున్నాడు. ప్రసాదరావుకు మరింత అసహ్యం వేసింది. "ఏమిటయ్యా ఇది? ఈ బిచ్చగాళ్ళ నెందుకు రానిచ్చారిక్కడికి?....పంపించండి"-అని రేకేశాడు. కాని, ఆయన మాటను ఎవరూ పట్టించుకోలేదు. జనం వారి మాటల్లో వారున్నారు. పోలీసులు బీడీలు తాగుతూ చచ్చు జోకులేసుకుంటు న్నారు. ముసలాడు మెల్లెగా తల తిప్పి చూశాడు. "ఎలక్షను సారు" తనను బిచ్చగాడని అనడం విన్నాడు. వళ్ళు మండింది. మనసు నీళ్ళయ్యింది. తను బిచ్చగాడు కాదని అరవాలనుకున్నాడు. బిచ్చ గాడు తనో, ఓటు అడుక్కోవడానికి వచ్చిన యాదగిరి రెడ్డో తేల్చు కోవాలనుకున్నాడు. కాని శక్తి లేదు. వృద్ధాప్యం - వృద్ధాప్యం నివా రణ లేని పెద్ద జబ్బు.

"ఈ ముసలోడు కల్లంచెంద్రిగాని అయ్య ఎంకట్రాములు గాదూ?" అంటూ దగ్గరి కొచ్చాడు, వూరి వైద్యుడు బేతి సత్తయ్య. కొద్దిసేపు ఆగి "గీడు గీడికెందుకో ఒచ్చిండు?" అని ప్రశ్నించి జనం వైపు చూశాడు. అందులో ఇద్దరు ముగ్గురు కదిలి వైద్యుని వైపు వచ్చారు.

"ఎందుకొచ్చిడంటె - ఓటేశెటందు కొచ్చిండు"

"ఆ-ఒచ్చిండు ఈడ పడిపోతున్నదని! అల్లు యాదగిరి రెడ్డి తమ్ములు ముసలోని బాయికాడికి-బోయి బండ్లె ఏసుకొచ్చిండ్రు గాదు" అన్నాడు ఓ పసులకాచే పోరడు.

"ఒశి నీయక్క-ఓటు కోసం సచ్చేముసలోన్ని లేపొకచ్చినారు? ఈడు మల్ల ఆని బాయి కాయిడి ఎట్ల జేరాలె ఏం కత?" విచారించాడు వైద్యుడు సత్తెయ్య.

"అది ఆ ఓట్లేయించుకున్నోనికుండాలె. శిగ్గు, శరం-అరె, గాడేన్నో మూడు మైళ్లమీద అని బాయికాడి కొట్టంల రంగ రంగమని పడి వున్నోన్ని పట్కొచ్చుడేంది? ఓటేయించుకోంగనె ఎక్కడో డక్కడ జారుకునుండేది? ఆడేమో పక్షోలె తల్లడియ్య బట్టె-ఇప్పుడాని సంగతెవడు జూడాలె? దాటె దాక ఓడ మల్లయ్యట. దాటి నంక బోడి మల్లయ్యట....గదేందో సామెతుండెగద-" ప్రైమరీ స్కూలు ప్యూన్ చంద్రమౌళి ఆవేశంగా మాట్లాడుతూ వుండగా లారీ చప్పుడయ్యింది. అందరూ రోడ్డు వైపు తిరిగారు. దారికడ్డంగా వున్నాడని ముగ్గురు పోలీసులు ఎంకట్రాముల్ని అమాంతం లేపి పైన వరండాలో పడుకోబెట్టారు. ఎంకట్రాములు వాళ్ళకు అతి కష్టంగా చేతులు జోడించి దండం బెట్టాడు.

ముసలాడికి అందరు అనే మాటలు వినిపిస్తూనే వున్నాయి. ముసలితనం వచ్చినా కళ్ళు చెవులు బాగానే పని చేస్తున్నాయి. కాని మాట్లాడేందుకు లేచి తిరిగేందుకు శక్తిలేదు. తిరిగి ఇంట్లో దింపుతా మన్న కట్టడి మీద బండిలో వేసుకొచ్చారు. పోలింగ్ ఆఫీసర్ సహా యంతో ఓటు వేయించుకున్నారు కాని, పని అయిపోయాక తిరిగి ఇంట్లో చేర్చాలన్నది ఎవరికీ గుర్తున్నట్లు లేదు. పోగా ఎంకట్రాము లుకు మరో భయం. కొడుక్కు తెలిస్తే ఎంత తిడతాడోనని-ఎన్ని కలు బహిష్కరించాలని వూళ్ళో ఎవరూ ఓట్లు వేయగూడదని ప్రచారం చేసిన వాళ్ళలో చెంద్రిగాడొకడు. మరీ ముఖ్యంగా యాదగిరిరెడ్డి మనుషులు వచ్చి బలవంతం చేసి తీసుకొచ్చారంటే, ఎంత మండి పోతాడోనన్న భయం.

ఇరవై యేళ్ళ క్రితం-యాదగిరి రెడ్డి తండ్రి వీరారెడ్డి వూరికి దొర. అతనితో పోటీ పడలేక, అతని ధాటికి ఆగలేక, అతన్నించి దూరంగా వుంటే మంచిదని వూరు విడిచి, అడవిలో పొలం దగ్గర గుడిసె వేసుకున్నాడు వెంకట్రాములు. ఆ తరువాత పక్క పక్క

పొలాల వాళ్ళు కూడా వచ్చి గుడిసెలు వేసుకున్నారు. అట్లా ఆ గ్రామం కింద ఒక గూడెం తయారయ్యింది. ఈ మధ్య కాలంలో చాలా మార్పులొచ్చాయి. వీరారెడ్డి ఏక్సిడెంట్‌లో చనిపోయాడు. అతని కొడుకు పట్నంలో చదువు పూర్తి చేసుకునివచ్చి, ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున వ్యవసాయం చేస్తున్నాడు. ఇప్పుడు మండల్ ప్రెసిడెంట్ పదవికి పోటీ చేస్తున్నాడు. వెంకట్రాములు కొడుకు చెంద్రిగాడు పెద్దవాడయ్యాడు. చెమటచుక్కకు చెమట చుక్కే పుడుతుందని చెంద్రిగాణ్ణి చూస్తే తెలుస్తుంది. వాడికి తల్లీ దండ్రీ వెంకట్రాములే. పెళ్లీడుకొచ్చినా ఇంకా చేసుకోలేదు. వాడి ఆలోచనలన్నీ వేరే విధంగా వుంటున్నాయి. వాడికి యాదగిరి రెడ్డి అన్నా, అతని కార్యకలాపాలన్నా అసహ్యం.

"యాదగిరి రెడ్డి తండ్రోలె గాదురా. మంచోడు. కలుపుగోలు మనిషి. మనందరి ఇండ్లకు దిర్గుతాండు. తనను దొర అని పిలవొద్దంటడు. పేరుబెట్టి బిల్వమంటడు. మనిండ్లల్ల గట్క గంజి ఏదుంటె అది తాగి పోతనంటడు. ఇసం లేదు మనిషిల"- అని వెంకట్రాములు కొడుకుకు చాలాసార్లు చెప్పాడు. కాని చెంద్రిగాడు విన్లేదు.

"ఎన్కట్నించి లేంది, ఈ ఆర్నెల్లనించి వాడివ్వన్ని లేనిపోని ఏశాలు, ఎందుకేస్తున్నడనుకున్నవ్?- ఎలక్షన్ల మహత్యం!" అని వెటకారంగా నవ్వాడు చెంద్రిగాడు.

అప్పుడెప్పుడో కొడుకు చెప్పిన మాటలు జ్ఞాపకానికొచ్చాయి, వెంకట్రాములుకు- ముఖం మీద ఈగలు వాలుతున్నాయి. నీ ఓటు నాకంటే నాకని గుయ్‌మంటూ ఈగల్లాగ తిరిగిన మనుషులు జ్ఞాపకాని కొచ్చారు. మెల్లెగా చెయ్యి వూపుకున్నాడు. చుట్టూ కళ్ళు తిప్పి చూశాడు. ఎలక్షను వాళ్ళు అంతకుముందు వచ్చిన లారీలో వెళ్లిపోయినట్టుంది. హడావుడి లేదు. జనం కూడా పలచబడ్డారు. ఎవరో

కొద్ది మంది మాత్రం చుట్టలు కాల్చుకుంటూ లోకాభిరామాయణం మాట్లాడు కుంటున్నారు. పిల్లలు చెడుగుడు ఆట మొదలుపెట్టారు. పై వూరి నుండి చంద్రిగాడు ఎప్పుడు తిరిగొస్తాడో తెలియదు. వచ్చినా తండ్రిని తీసుకుపోవడానికి స్వంత బండి లేదు. అంతకు ముందుపడిన వర్షానికి ఊరికి, గూడానికి మధ్య యేరు పారుతోంది. అప్పుడే చీకటి పడిపోయింది. దీపాలు వెలిగిస్తున్నారు. ఎలా? ఎలా?? వెంకట్రాము లుకు మనసు మనసులో లేదు. తను ఇంట్లో లేకపోయేసరికి కొడుకు ఏమనుకుంటాడో-తనను ఇక్కడికి తీసుకొచ్చినట్లు ఎవరైనా చెబు తారోలేదో. ఎన్నో విధాలుగా ఆలోచిస్తున్నాడు. వెంకట్రాములు కళ్ళు ఆశగా చూస్తున్నాయి. ఏ క్షణంలోనైనా తనకు తెలిసిన వాళ్ళు కని పిస్తారేమోనని....కనిపిస్తే పలకరిస్తారేమోనని....

మబ్బులు మళ్లీ కమ్ముకొచ్చాయి. వెంకట్రాములుకు కలిగిం చిన దీన స్థితికి నిరసనగా ఆకాశం నల్లగా అయింది. ఏ క్షణంలోనో ఆకాశం భోరుమని యేడ్చేట్లుగా వుంది. చలిగాలి మొదలయ్యింది. వెంకట్రాములు వంటి మీద బట్టల్లేవు. మొలకు చుట్టుకున్న పంచెతప్ప -వణుకు వల్ల మూలుగు ఎక్కువైంది. కడుపులో ఆసరా లేదు. పొద్దున కొడుకు తాగించిన నాలుగు మెతుకుల గంజి. అంతే- రోజూ పగలు.... పక్క గుడిసెలల్లో వుండే పిల్లలు 'తాత తాత'- అంటూ చేరే వారు. మంచి నీళ్ళు అడిగితే ఇచ్చేవారు. అవతలికి ఇవతలికి వెళతానంటే తీసుకెళ్లేవారు. మరీ ముఖ్యంగా 'రాజ్య లచిమి' వచ్చేది. పెద్ద పెద్ద కళ్లు తిప్పుకుంటూ, పొడవైన జడలు వూపుకుంటూవచ్చేది. గాజుగ్లాసులో కల్లుతెచ్చితాగించేది. ప్రాణం కొంచెంహుషారుగా అయ్యేది. "బిడ్డలాలా-మీ రునం ఎట్ల దీర్సుకుంటనో ఏమోనే- పతి దానికి మీరె అరుసుకుంటాంన్రు. మీ అందరికిమంచి మొగల్లు,పెండ్లాలు దొరుకాలె." అని దీవించాడు. లేచి కూర్చుని కొంచెం తిరుగ గలిగే రోజున రాజ్య లచిమితో పరాచికాలాడేవాడు. "ఏ పొల్లా నన్ను పెండ్లి జేస్కోరాదె"

అనేవాడు. పిల్లలంతా ఎగతాళిగా నవ్వేవారు. దాంతో వెంకట్రాములు కళ్ళు మెరిసిపొయ్యేవి. అంతలోనే యవ్వనంలో చనిపోయిన తన భార్య జ్ఞాపకాని కొచ్చి కళ్ళు చెమ్మగిల్లేవి. ఇప్పటి దాకా బతికి వుంటే గనక, చంద్రిగాణ్ణి చూసుకుని ఆ తల్లి ఎంత గర్వపడేదోననుకునే వాడు. ఒక్కొక్కసారి చంద్రిగాని కోసం వచ్చిన వాళ్లు పాత రోజుల్లోని వ్యవసాయంగూర్చి మాట్లాడి పొయ్యేవారు. వెంకట్రాములు పాత అనుభవాలు చెప్పేవాడు.

ఈ రోజు పగలంతా తన యింటికి దూరంగా పంచాయతీ ఆఫీసు ముందు పడి వున్నాడు. తనకేం కావాలో అడిగే వాళ్ళు లేరు. తనకు తానై లేచి అడిగే శక్తి అంతకన్నా లేదు. ఈ అశక్తత ఇప్పటిది కాదు. వీరారెడ్డితో భూమి పంచాయతి వచ్చినప్పటిది. అంతకు ముందు వెంకట్రాములు ఊళ్ళో పులిలాగ తిరిగే వాడు. భూమి తగాదాలలో, తప్పుడు సాక్ష్యాలలో ఇరుక్కుని. వీరారెడ్డి ప్రతాపానికిబలై, జరిమానాలు కట్టి, జైలుకెళ్లి, పోలీసు లాఠీ దెబ్బలు.... తిని.... అనేక రకాలుగా హింసలకు లోనై, శారీరకంగా, మానసికంగా అశక్తుడై పొయ్యాడు వెంకట్రాములు. దీనికంతటికీ కారణం వెంకట్రాములకు డబ్బులేదు. హోదాలేదు.అందుకే అతనికి దర్పం లేదు. బంధువులు లేరు,బలగం లేదు. మంచివాడని వూళ్ళో అందరికీ తెలుసు. కాని దాంతో వెంకట్రాములుకు లాభం లేదు.

భోరున వర్షం మొదలయ్యింది. వర్షపు జల్లులో ఆఫీసు వరండా సగం తడిసింది. ఉరుములు, మెరుపులు, వర్షం! వెంకట్రాములు వీలయినంత ముడుచుకున్నా చలి ఆగడం లేదు. బయటంతా చల్లదనం. కడుపులో మాత్రం మంటలు ఆకలి మండిపోతోంది. ప్రాణం శ్వాసను బరువుగా లాగు తోంది. గొంతులో కత్తిపోట్లలాగే తెరలు తెరలుగా దగ్గు! కడుపులో పేగుల్లోంచి తన్నుకొస్తున్న దగ్గు!! ఆ వర్షపు హోరులో బస్సు చప్పుడయ్యింది. కొద్ది

సేపటి తర్వాత పూళ్లోకి వచ్చే రాత్రి బస్సొచ్చింది. మనుషులు బస్సు దిగుతూనే నిలువునా తడిసి పొయ్యారు. కాసేపు నిలబడదానికైనా చుట్టుపక్కల ఏమీలేదు. పంచాయతీ ఆఫీసులోకి పరిగెత్తుకొచ్చారు. నిమిషంలో అంత పెద్ద వరండా నిండిపోయింది.

"ఎవలో పండుకున్నరు గీడ?"- అన్నారెవరో.

"ఏయ్ లేలే. లేశి కూసో. జాగ జాల్తలేదు" అని మరొకడు గద్దించాడు. ఎంకట్రాములు కదల్లేదు. మెదల్లేదు. ఆ వర్షపు హోరులో మూలుగు ఎవరికీ వినిపించలేదు. తడి అడుగులు, తడిసిన బట్టల వల్ల వరండా అంతా పచ్చిగా బురద బురదగా తయారైంది. నేల మీద పాకుతూ వచ్చిన చల్లటి నీళ్ళు వెంకట్రాములుకు చలి చురకలు వేస్తున్నాయి. "అమ్మో-అయ్యో" అని గొణుక్కున్నాడు. ఎవరో ఒకరు వంగి పరిశీలనగా చూశారు. మళ్ళీ నిలబడి "ఎవరో శేతగాని ముసలోడు" అని అన్నాడు, అందరినీ ఉద్దేశించి.

"ఈ ఆఫీసులు ఒచ్చిపోయే బిచ్చగాల్లు పండెటందుకే కట్టిచ్చి నట్టుంది"-అన్నాడొకడు. ఆ మాటకు కొందరు బొలబొలా చలి నవ్వులు నవ్వారు. వెంకట్రాములు మనసు సల సల మసిలిపోయింది. "నేను బిచ్చపోణ్ణి గాదు. వాడు ఓటు కోసం నన్నిక్కడికి దెచ్చి నోడు, యాదగిరి బిచ్చపోడు" అని గొణుక్కున్నాడు, వరండాలోని వాళ్ళంతా, వళ్ళంతా నీళ్ళు కారుతూవుంటే, తడిసిన కోళ్ళలాగా ముడుచుకుపోతున్నారు. ఎవరికి తోచింది వాళ్ళు మాట్లాడుతున్నారు.

"నీయవ్వ రెండేళ్ళనించి కాలం లేదు. ఈ సారన్న ఆనలు బుగ్గ పడాలె"

కొద్దిసేపటికి సంభాషణల జోరు, వర్షపు హోరూ తగ్గాయి. సన్నని ముసురు మిగిలింది. చూడబోతే రాత్రంతా అలాగే వుండే ట్లుంది.

ఒకప్పుడు తల విదిలించుకుని తిరుగుతూ వుండే వెంకట్రా ములు అణగదొక్కబడ్డాడు. ఆ సాయంత్రం దాకా గాలికి లేచిన మట్టి, ఇప్పుడు నీటితో అణిగింది. వెంకట్రాములు ప్రాణంలాగా నేల మీద నీళ్ళు యింకి పోతున్నాయి. వెంకట్రాములు జీవితాంతం నీరు గారిపోయినట్టే-తూముల్లో వర్షపు నీరు- పొళపొళమని జారిపో తున్నది. వెంకట్రాములు బతుకు లాగ భూమంతా తడిసి పచ్చి ముద్ద య్యింది. బురద బతుకు మీద తెలిసిన వాళ్ళనీ తెలియని వాళ్ళనీ ఎందరివో అడుగులు.

ఉన్నట్టుండి ఆఫీసు ముందు నుండి కత్తులు, గొడ్డళ్ళతో మను షులు పరిగెత్తారు. ఉరుమురిమినట్టు అరుస్తున్నారు. సైకిల్ చైన్‌లతో ఒకర్నొకరు వెంబడిస్తున్నారు. ఎవరికీ నోళ్ళు సరిగా తిరగడం లేదు. అందరిలో సారా ప్రవహిస్తోంది. సారా అరిపిస్తోంది. సారా ఆయుధాలు లేపుతోంది. పోయించిన సారా.... ప్రాణాలు కూడా తీస్తానంటోంది. ఊళ్లోని ప్రతి సందు గుండా కొంతమంది జనం వచ్చి చేరారు. కొందరు భయపడి అక్కణ్ణించి పారిపొయ్యారు.

ఎవరి మాట ఎవరూ వినిపించుకోవడం లేదు. యాదగిరి రెడ్డి మనుషులు, రోషయ్య మనుషులు యుద్ధానికి దిగారు. ప్రాణాలు తీసుకోవడానికి తయారైనారు.నాలికలు పీకేస్తామని శపథాలు చేసుకుంటు న్నారు. జబ్బలు చరుచుకుంటున్నారు. మాటల్లో క్రోధం బుసలు కొడు తోంది. బూతు విచ్చలవిడిగా ప్రవహిస్తోంది. ఇరుపక్షాల వారిని చల్లబరి చేందుకు చాలామందే వున్నారు. కాని, వారి భయాలు వారివి. అయినా ప్రయత్నిస్తున్నాను. కొందరికాళ్ళు,చేతులు విరిగినయి. కొందరి తలలు పగిల్నయ్. అప్పుడు కొంత నిషా దిగింది. అప్పుడు మనుషులమని జ్ఞాపకమొచ్చింది. అప్పుడు తమ సంసారాలు జ్ఞాపక మొచ్చినయి. అప్పుడు తాము తోలు బొమ్మలమని, ఆడించే చేతులు వెనక వున్నా యని, నిజం తెలిసింది. తమ మీద తమకే అసహ్యం వేసింది. తమ

మీద తమకే కసి పెరిగింది. ఎవరికి వారు ఎక్కడి వారక్కడ మాయమయ్యారు. అరుపులు తగినయి. ఆవేశాలు తగ్గినయి. గాయ పడ్డ వాళ్ళను వాళ్ల వాళ్ళ మనుషులు తీసుకుపొయ్యారు. వర్షం తరువాత వర్షం-రెండో వర్షం కూడా తగ్గినట్లయ్యింది. అప్పుడప్పుడు పశువుల అరుపులు, కుక్కల అరుపులు వినిపిస్తున్నాయి. ఎక్కడి నుంచో రేడియో సంగీతం వినిపిస్తోంది. వుద్రేకాలెంత సేపూ? అన్నట్లు చెట్ల కొమ్మలు నింపాదిగా వూగుతున్నాయి. మనిషి ప్రవృత్తికి గుండెలు బాదుకుంటున్నట్లు చెట్లమీద పక్షుల రెక్కలు పటపట కొట్టుకుంటున్నాయి.

పక్క నుండి కొట్టే జల్లు కాకుండా కప్పుపై నుండి కూడా నీళ్ళు కురుస్తున్నాయి. వెంకట్రాములు తన మీద ఆశ వదులుకున్నాడు. అంత రాత్రయినా కొడుకు చెంద్రిగాడు రాలేదు. వర్షం వల్ల యేరు ఎక్కువై వుంటుంది. దాటి రావడం కష్టం. వెంకట్రాములుకు ఇప్పుడు వర్షపు నీళ్ళూ, చలి బాధ కలిగించడం లేదు. అయిపోయింది. వళ్ళంతా చల్లబడుతోంది. ఒక్కసారి చంద్రిగాణ్ణి, రాజ్యలచ్మిని, పిల్లలందరినీ చూస్తే బావుండుననిపించింది. స్కూలు ప్యూను చంద్రమౌళి ముసలివాడికేదైనా తిండి పెడదామనుకున్నాడు. కాని, వర్షం ఆటంకమైంది. ఆ తర్వాత ఆఫీసు ముందు, రచ్చబండ మీద యిరుపక్షాల వాళ్ళు తన్నుకుంటున్నారని తెలిసి, అటువైపు వచ్చే ప్రయత్నం మానుకున్నాడు. అవసరం వుండి తీసుకొచ్చిన వాళ్ళు ముసలి వాడి గురించి పట్టించుకోవడం లేదు. మధ్యలో తమకేమిటి? అని మిగిలిన వారు వూరుకున్నారు. ముసురు ఒక్కోసారి తగ్గుతోంది-మళ్లీ ఎక్కువౌతోంది. అట్లా ఎంత సేపయ్యిందో ఎంకట్రాములుకు తెలియదు. సన్నగా మూలుగుతున్నాడు.

చంద్రిగాడికి విషయం తెలిసి భగ్గున మండిపొయ్యాడు. కాని, కొంత సేపు ఆలోచించాక చల్లబడ్డాడు. "నల్గురు నాల్గు దిక్కుల్నించి

బలవంతం చేసి, బండ్లెస్కోని దీస్కపోతె ముసలోడు మాత్రం ఏం జేస్తడు?" అనుకున్నాడు. అట్లా తీసుకుపోయిన వాళ్ళు కనిపిస్తే మెడలు విరిచేంత కోపంలో ఉన్నాడు. ఆ కోపంతోనే మెరుపులో మెరుపయ్యాడు. వర్షంలో చినుకయ్యాడు. తండ్రి కోసం పంచాయతి ఆఫీసు చేరేసరికి తెల తెలవారుతోంది. వర్షం పూర్తిగా తగ్గింది. చంద్రిగాడు ఒక్కడు లేడు. వెంట జతగాడున్నాడు. ప్రాణానికి ప్రాణం అడ్డు పెట్టే అయిలేసున్నాడు. ఇద్దరూ చీకట్లో వెంకట్రా ముల్ని వెతికి గుర్తుపట్టారు. "అయ్యా! అయ్యా!!" అని గట్టిగా పిలి చారు. భుజంతట్టారు. వెంకట్రాములు మాట్లాడేటట్టు లేడు. మూలుగు హీనమై పోయింది. చలిలో వర్షంలో అనాథలా తండ్రి ఎంత కష్టపడి వుంటాడో చంద్రిగాడు వూహించుకున్నాడు. చుట్టూ చూశాడు. ఊరంతా నిశ్శబ్దంలో తడిసి వుంది. చంద్రిగాడికి ఊరు వల్లకాడు లాగా కనిపించింది. కాండ్రించి ఉమ్మేశాడు.

"చంద్రీ! మీ అయ్య పని అయిపొయ్యింది. ఇంటికి కొంటవోతె ఫాయిద లేదు. సత్తెయ్య తానికి తీస్కపోదాం-సూది మందిప్పిద్దాం పా" సూచించాడు అయిలేసు. చంద్రిగాడు సిద్ధమైనాడు. తండ్రిని లేపి, భుజంమ్మీద వేసుకున్నాడు. కట్టెను ఎత్తుకున్నట్లుగా ఉంది. వూళ్ళోకి దారి తీశాడు అయిలేసు. పెద్ద పెద్ద అడుగులు పడుతు న్నాయి. భేతాళ కథల్లో శ్మశానం నుండి శవాన్ని మోసుకెళ్తున్న విక్రమార్కుడిలాగా వున్నాడు చంద్రిగాడు. ఇద్దరి ముఖాలు కంద గడ్డలయ్యాయి. ఎవరి మీదో కసి, కోపం పెరుగుతున్నాయి.

"ఆగు"-అరిచాడు చంద్రిగాడు.

అయిలేసు గిరుక్కున వెనక్కి తిరిగాడు. తండ్రిని దారిలోనే పడుకోబెట్టి, అనుమానంగా పరిశీలించాడు చంద్రిగాడు.

మూలుగు వినిపించడంలేదు. "అయ్యా" ఆకాశం దద్దరిల్లేలా ఆక్రోశించాడు. భయం భయంగా అయిలేసు వంగి చూశాడు. చంద్రిగాడు చూశాడు. లేచిపోయిన ప్రాణాన్ని మసక చీకట్లో చాలాసేపు వృధాగా వెదికారు.

చెంద్రిగాడి అరుపులకు చుట్టుపక్కల వాళ్లు లేచి, పరిగెత్తుకు రావడం మొదలయ్యింది. ○

ఆదివారం ఆంధ్రజ్యోతి
26 మే 1991